

వైభవంగా దేవి శరన్నవరాత్రులు


కడప అమ్మవారిశాలలో శ్రీరాజరాజేశ్వరీదేవిగా...

జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. - న్యూస్‌టుడే, బృందం


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో భవానీదేవి అలంకరణ


కడప శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో బ్రహ్మచారిణి అలంకరణలో...

ఆలయాల నిర్వహణ పద్దు పెంపు!

- ధూప, దీప, నైవేద్యం పథకానికి భరోసా
- రూ.10 వేలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ

-న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం

చిన్న ఆలయాల నిర్వహణకు ఆర్థిక కష్టాల నుంచి ఉపశమనం కల్పిస్తూ ఎన్డీయే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిత్య దీపారాధనలు చాలీచాలని నిధులతో ఆలయ ఆలనాపాలనా కష్టంగా ఉండేది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత హిందువుల ఆరాధించే మందిరాల బాగోగులకు భరోసా ఇవ్వాలని ముందుకొచ్చింది. ప్రస్తుతం ఇస్తున్న మొత్తాన్ని మరింత పెంచడంతో అర్చకులు, భక్తులు ఊరట చెందుతున్నారు.

● వైఎస్సార్ జిల్లాలో దేవాదాయ శాఖ పర్యవేక్షణలో అన్ని రకాల ఆలయాలు కలిపి 3,407 ఉండగా, 547 ఆలయాల్లో ధూప, దీప, నైవేద్య పథకం అమలవుతోంది. వీటికి ప్రస్తుతం ప్రతినెలా రూ.5 వేలు చొప్పున ఇస్తున్నారు. ఇందులో పూజాకైంకర్యాలకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు రూ.2 వేలు, అర్చకుడికి రూ.3 వేలు వంతున ఇస్తున్నారు. ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇక మీదట పూజల అవసరాల నిమిత్తం రూ.3 వేలు, అర్చకుడికి రూ.7 వేలు వంతున ఇవ్వడానికి అనుమతిచ్చారు. గతంలో నెలకు రూ.27.35 లక్షలు ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉండేది. ఇకపై రూ.54.70 లక్షలు ఖర్చు చేసుకోవచ్చు. ఏడాదికి రూ.30 వేల లోపు వార్షిక ఆదాయం ఉన్న వాటికే వర్తింపజేయనున్నారు. రానున్నరోజుల్లో పథకం కింద లబ్ధి పొందే ఆలయాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

● అన్నమయ్య జిల్లాలో దేవదాయశాఖ పర్యవేక్షణలో 1,663 ఆలయాలుండగా, ధూప, దీప, నైవేద్య పథకం కింద ప్రస్తుతం 269 ఆలయాలు లబ్ధి పొందుతున్నాయి. మదనపల్లె నియోజకవర్గంలో 27, తంబళ్లపల్లెలో 35, పీలేరులో 36, రైల్వేకోడూరులో 46, రాజంపేటలో 52, రాయచోటి నియోజకవర్గంలో 73 మందిరాల్లో అమలు చేస్తున్నారు. ప్రస్తుతం నెలకు రూ.5 వేలు వంతున రూ.13.45 లక్షలు వెచ్చిస్తున్నారు. ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఇకమీదట రూ.26.90 లక్షల వరకు నిర్వహణకు వాడుకోవచ్చు. ఇప్పటికే మరికొన్ని ఆలయాలకు వర్తింపజేయాలని ప్రతిపాదనలొచ్చాయి. ఉన్నత స్థాయి నుంచి అనుమతులకు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేస్తాం

దేవాదాయశాఖ పరిధిలో ప్రస్తుతం ధూప, దీప, నైవేద్యం పథకం కింద ఒక్కో ఆలయానికి నెలకు రూ.5 వేలు ఇస్తున్నాం. ఇకపై రూ. 10 వేలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటాం.
- మల్లికార్జున ప్రసాద్, విశ్వనాథ్, జిల్లా అధికారులు, దేవాదాయశాఖ

పల్లె దారులకు మోక్షం!

- అధ్వానంగా ఉన్నవాటికి తొలి ప్రాధాన్యం
- త్వరలోనే ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు


రెండేళ్ల కిందట కంకర పరిచి వదిలేసిన బ్రహ్మంగారిమఠం మండలం నాగిశెట్టిపల్లె రహదారి

-ఈనాడు, కడప

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పల్లె రహదారులు అడుగుకో గుంత.. గజానికో గొయ్యితో అధ్వానంగా తయారయ్యాయి. గత అయిదేళ్లలో తట్టమట్టికి నోచుకోని రహదారులున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పరిధిలోని రహదారుల మరమ్మతులకు ఎన్డీయే ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. రహదారిపై 20 కిలోమీటర్ల కంటే వేగంగా వాహనాన్ని నడపలేని దుస్థితిలో ఉన్న వాటికి తొలి ప్రాధాన్యమివ్వనుంది. రెండో ప్రాధాన్యంగా 40 కిలోమీటర్ల కంటే వేగంగా వాహనాన్ని నడపలేని రహదారులను గుర్తించింది. వీటిని మలి దశలో మరమ్మతులు చేపట్టాలనే ప్రాధమ్యాలను ఎంపిక చేసుకుంది. ఈ మేరకు రహదారులను గుర్తించి మరమ్మతులు చేసేవిధంగా చర్యలకు ఉపక్రమించనుంది.

● వివిధ పథకాలు, బ్యాంకు రుణాల కింద చేపట్టిన రహదారుల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. పనులు సైతం కంకర పరిచిన అనంతరం ఆపేయడంతో రాకపోకలకు ప్రజల నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. వీటిని పూర్తి చేసేదిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల్లో 705 రహదారుల నిర్మాణపనులు అసంపూర్తిగా ఉన్నాయి. సింహభాగం పనులు పులి వెందుల నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఇక్కడ పాడా కింద రూ.700 కోట్ల బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. కొందరు గుత్తేదారులు బిల్లుల కోసం న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు. ఇటువంటి పరిస్థితుల్లో ముందుకెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి జిల్లాస్థాయిలో ప్రతిపాదనలు తయారు చేయించి స్వీకరించింది. త్వరలోనే పరిష్కారం దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ పీఎంజీఎస్‌వై, ఏపీఆర్ఆర్‌పీ, నాబార్డు రుణం, ఎస్‌డీఎంఎఫ్, పంచాయతీరాజ్ రహదారులు, భవనాలశాఖ కింద పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు రూపొందించారు. ఇవన్నీ త్వరలోనే కొలిక్కి వచ్చి క్షేత్ర స్థాయిలో పనులు చేపట్టేవిధంగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తున్నారు.


అధ్వానంగా రాయచోటి మండలం యండపల్లి-మాధవరం రహదారి

ఇదే తరహాలో రహదారులు, భవనాలశాఖ విభాగంలోనూ కసరత్తు జరుగుతోంది. రెండు జిల్లాల్లో వందలాది కిలోమీటర్ల రాష్ట్ర, జిల్లా రహదారులున్నాయి. భారీ వర్షాలు, తుపాన్ల తాకిడికి 80 శాతం రహదారులు ధ్వంసమయ్యాయి. ప్రజలు ప్రయాణించడానికి వీల్లేనంతగా ఛిద్రమయ్యాయి. వైకాపా అధికారంలో ఉన్నన్నాళ్లు నిర్వహణను పట్టించుకోలేదు. ప్రజలు ప్రమాదాలకు గురైన పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితుల్లో అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సిన రహదారులపై ప్రతిపాదనలను ప్రభుత్వం తెప్పించుకుంది. కొన్నింటికి ఇప్పటికే పరిపాలనాపరమైన అనుమతులు సైతం ఇచ్చింది. ఆమోదించిన పనులకు వెంటనే టెండర్లు పిలిచి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు రెండు జిల్లాల పరిధిలో ముమ్మర కసరత్తు జరుగుతోంది. ఇన్నాళ్లు బదిలీల వ్యవహారంలో ఉన్న రహదారులు, భవనాలశాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాలు ఇప్పుడే కుదుటపడ్డాయి. రహదారులకు మరమ్మతులు చేపట్టడానికి అన్ని రకాల చర్యలు చేపడుతున్నాయి.

ఇక వేటు పడుతుంది!

మైదుకూరు తహసీల్దారుతో సహా 15 మందికి తాఖీదుల జారీ

ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారంపై కలెక్టర్ శివశంకర్ చర్యలు

ఈనాడు, కడప : వైకాపా నేతల పాపాలకు మైదుకూరు మండలంలో 15 మంది రెవెన్యూ సిబ్బందిపై వేటు పడనుంది. ఈ మేరకు కలెక్టర్ శివశంకర్ శుక్రవారం రాత్రి సంజాయిషీ తాఖీదులు జారీ చేశారు. గతంలో తహసీల్దారుగా పనిచేసిన అనూరాధ (ప్రస్తుతం పెండ్లిమర్రిలో పనిచేస్తున్నారు)తో పాటు 14 మంది వీఆర్వోలపై వేటు వేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోదియా ఆదేశాల మేరకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల దహనం అనంతరం ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ వ్యవహారంతోనే ఘటన జరిగినట్లు అంచనాకు వచ్చిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. వైకాపా హయాంలో సాగిన భూదందాలపై నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి అడుగుగా రాష్ట్రంలోని ఆరు మండలాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి విచారణ చేపట్టింది. దీంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అత్యధికంగా ఫిర్యాదులు రావడం, ఫ్రీ హోల్డ్ భూములను ఎక్కువ విస్తీర్ణం చేయడంతో జిల్లాలో మైదుకూరు మండలాన్ని ఎంపిక చేసి సమగ్ర విచారణ చేపట్టింది. విచారణ కమిటీ క్షేత్రస్థాయిలో రెవెన్యూ దస్త్రాల ఆధారంగా శోధన చేపట్టింది. నిబంధనలు పాటించకుండా నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించారని, 20 ఏళ్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోలేదని, తప్పుడు లెక్కలతో నిషేధిత జాబితా నుంచి తొలగించారని, భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని గుర్తించింది. మండలంలో 2,788 ఎకరాలను నిషిద్ధ జాబితా నుంచి తొలగించగా, 576 ఎకరాల వరకు అక్రమంగా తొలగించినట్లు గుర్తించారు.

జిల్లా రైతులకు రూ.37.42 కోట్ల పీఎం కిసాన్ నిధులు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద రైతులకు కేంద్రప్రభుత్వం 18వ విడత నిధులు విడుదల చేస్తోంది. జిల్లాలో 1,87,083 మంది రైతులకు రూ.37.42 కోట్లు శనివారం వారి ఖాతాల్లో జమ కానుంది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొనే ఈ కార్యక్రమాన్ని ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని రైతు సేవాకేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.

తిరుగు ప్రయాణానికి 240 ప్రత్యేక బస్సులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: దసరా సెలవుల అనంతరం ప్రయాణికులు స్వస్థలాలకు వెళ్లేందుకు 240 ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం గోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక బస్సులు ఈ నెల 13 నుంచి ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఇవి సాధారణ ఛార్జీలతో నడుస్తాయని, ముందస్తు రిజర్వేషన్ సౌకర్యముందన్నారు. హైదరాబాద్‌కు 67, బెంగళూరుకు 79, విజయవాడకు 42, చెన్నైకు 12 సర్వీసులతో పాటు తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం ప్రాంతాలకు 40 బస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 7, 8 తేదీల్లో తిరుపతికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ నేపథ్యంలో అన్ని రకాల బస్సు పాసులను జారీని నిలిపేస్తున్నట్లు ఆర్.ఎం. తెలిపారు. తిరిగి 7వ తేదీ నుంచి యథావిధిగా కౌంటర్లు తెరుస్తామన్నారు.

టెట్‌కు 1,005 మంది హాజరు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) శుక్రవారం రెండోరోజు కొనసాగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో నిర్వహించిన పరీక్షలకు 1,155 మందికి 1,005 మంది హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ తెలిపారు.

27 నుంచి హైదరాబాద్‌కు విమాన సర్వీసులు

కడప చిన్నచౌకు: కడప నుంచి హైదరాబాద్‌కు అక్టోబరు 27 నుంచి రోజువారీ విమాన సర్వీసు ప్రారంభం కానుంది. గత వైకాపా ప్రభుత్వంలో విమానయాన సంస్థకు ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వకపోవడంతో సర్వీసులు నిలిపేశారు. అప్పుడు అధికారులు చొరవ చూపి పునఃప్రారంభింపజేశారు. ప్రభుత్వం నుంచి తగిన సహకారం కొరవడడంతో గతేడాది ఫిబ్రవరి నుంచి సర్వీసులు పూర్తిగా నిలిచి పోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే మాధవి, జిల్లా తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుల దృష్టికి తీసుకెళ్లారు. వారి చొరవతో కడప నుంచి హైదరాబాద్‌కు విమాన సర్వీసును తిరిగి ప్రారంభించడానికి చర్యలు చేపట్టారు.

జడ్పీ డిప్యూటీ సీఈవోగా మైథిలి

కడప ఏడురోడ్లు : జడ్పీ డిప్యూటీ సీఈవోగా మైథిలీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె డ్వామాలో ఏపీడీగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు.


జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి

విహార యాత్రలతో విజ్ఞానం

వైవీయూ (కడప), పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే: విహార యాత్రలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని, ఆలోచనాశక్తిని పెంపొందింపజేస్తాయని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. ఏపీ దర్శన్ పేరుతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 500 మంది విద్యార్థులతో విహారయాత్రకు బయలుదేరిన బస్సులను ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద శుక్రవారం ఆయన కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గైడ్స్‌తో నిర్వహించిన ప్రేరణ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్-2047 లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పదోతరగతి విద్యార్థులకు విహారయాత్రను ఏర్పాటు చేశామన్నారు. విహారయాత్రకు వెళ్లే విద్యార్థులకు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి బిస్కెట్స్, స్నాక్స్‌లను వితరణగా అందించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, కడప, జమ్మలమడుగు, ఆర్డీవోలు జాన్ ఎర్విన్, సాయిశ్రీ, డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

జిల్లాలో జోరు వాన

జిల్లా సచివాలయం : జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అత్యధికంగా కమలాపురంలో 41.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా, పులివెందులలో 37.2, లింగాలలో 36.2, చాపాడులో 34.8, కొండాపురంలో 27.8, వీరపునాయునిపల్లెలో 22.6, కడపలో 20.2, వేములలో 20.4, వేంపల్లెలో 18.2, పెండ్లిమర్రిలో 17.4, మైదుకూరులో 17, ప్రొద్దుటూరులో 13.4, సిద్దవటంలో 11 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

పంట కాలువను మాయం చేసి... కడప నగరాన్ని ముంచేసి...!

గత వైకాపా ప్రభుత్వం నిర్వాకమిది

న్యూస్‌టుడే, కడప నగరపాలక సంస్థ

కడప నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా ఆర్టీసీ బస్టాండు, గ్యారేజీ, దాని ముందు ప్రధాన రహదారి చెరువులా మారుతున్నాయి. నగరపాలక సంస్థ, రహదారులు, భవనాలశాఖ అధికారులు ఎన్ని మార్గాలు అన్వేషించినా, ఎంత ప్రయత్నించినా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. వై కూడలి నుంచి అంబేద్కర్ కూడలి, ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వరకు ఉన్న సహజ వరద ప్రవాహ మార్గాన్ని వైకాపా హయాంలో పూడ్చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది.

● ఆర్టీసీ బస్టాండు - కోటిరెడ్డి కూడలి ప్రధాన మార్గంలో ఆర్ఎం కార్యాలయం, గ్యారేజీ సమీపంలో నుంచి ఒక పంట కాలువ ఉంది. ఇది ఇక్కడ ఓ దుకాణం, ఇతరుల ప్రైవేటు భూమి పక్కనుంచి ముందుకు ప్రవహిస్తూ రాజారెడ్డి వీధి, సియోన్‌పురం తదితర వీధులమీదుగా ముందుకు సాగుతుంది. ప్రస్తుతం ఎక్కడా కాలువ ఆనవాళ్లు కూడా లేవు. దానిని పూర్తిగా పూడ్చేశారు. పైగా కాలువకు గల బఫర్‌జోన్‌ను మినహాయిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అంటే సాధారణంగా ఎవరైనా నిర్మాణాలు చేపట్టాలంటే కాలువ, దానికి గల బఫర్‌జోన్‌ను వదిలేయాలి. దాన్ని సెట్‌బ్యాక్స్, రాస్తా కోసం వినియోగించకూడదు. ఈ కాలువ విషయంలో ఈ నిబంధనను ఎత్తేశారు. బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టకుండా వినియోగించుకోవచ్చని అనుమతి ఇచ్చారు. దీంతో జోన్ అధికారికంగా మాయమైంది. దాని పక్కన గల కాలువను ఆనవాళ్లు లేకుండా పూడ్చేసి, నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం అది నీటి పారుదలశాఖ రేఖాపటాలకు మాత్రమే పరిమితమైంది. నగరంలో ఇలాంటి పంట కాలువలు దాదాపు 200 ప్రాంతాల్లో అన్యాక్రాంత మయ్యాయని నీటిపారుదల శాఖాధికారులు చెబుతున్నారు. స్వల్ప వర్షానికే నగరంలోని అనేక ప్రాంతాలు నీట మునగడానికి ఈ కాలువల ఆక్రమణే ప్రధాన కారణమని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా వీటిని పునరుద్ధరించి నగరం నుంచి వర్షపు నీరు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.


రూపు కోల్పోయిన పంట కాలువ

కాలువ ఉంది ఆయకట్టు లేదు

ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో పంట కాలువ, దానికి సంబంధించిన బఫర్‌జోన్ ఉండాలి. దానికి ఇప్పుడు ఆయకట్టు లేదు. బఫర్‌జోన్‌ను మినహాయిస్తూ గతంలో ప్రభుత్వం నుంచి అనుమతులొచ్చాయి. కాలువలోని మిగిలిన భాగంపై నిర్మాణాలు వెలిశాయి. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవానే దానిపై ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం.
- వెంకట్రామయ్య, ఈఈ, నీటిపారుదల శాఖ

బఫర్‌జోన్‌ను వినియోగించుకోవచ్చు

ఇక్కడి పంట కాలువకు సంబంధించిన బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టకుండా వినియోగించుకోవచ్చని నీటిపారుదల శాఖాధికారులు ఎన్వోసీ ఇచ్చారు. దానికనుగుణంగా గతంలో పురపాలక శాఖ ప్రణాళిక విభాగం వారు నిర్మాణదారుడికి ప్లాన్ అనుమతి ఇచ్చారు. కాలువ పూడ్చివేతను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళతాం.
- నాగేంద్ర, ఇన్‌ఛార్జి సిటీ ప్లానర్

సీటీఐను అడ్డుకున్నారు!

- ప్రతిష్టాత్మకంగా భావించిన ఆప్కాబ్
- గుత్తేదారు సంస్థతో ఏపీఐఐసీ ఒప్పందం
- వైకాపా నేతల తీరుతో నిలిచిన పనులు

-న్యూస్‌టుడే, కడప నగరపాలక

కో-ఆపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (సీటీఐ)... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ కడపలో నిర్మించాలనుకున్న ప్రతిష్టాత్మక శిక్షణ కేంద్రం. గత వైకాపా ప్రభుత్వంలో ప్రతిపాదించిన భవన నిర్మాణానికి ఆ పార్టీ ప్రజాప్రతినిధులు అడుగడుగునా అడ్డుపడడంతో మొదట్లోనే పనులకు కాలం చెల్లిపోయింది. అప్పట్లో జిల్లా అధికార యంత్రాంగం సైతం వైకాపా నేతలకు వంత పాడడంతో భారీ నిర్మాణం ఆదిలోనే నిలిచిపోయింది.


కడపలో సీటీఐ నిర్మించాల్సిన ప్రాంతం

● ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ కడప నగరంలో కో-ఆపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ నిర్మాణానికి 2022, మార్చిలో ఏపీఐఐసీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది పనులకు సంబంధిత అధికారులు 2023, ఆగస్టులో పరిపాలనా ఆమోదం, అక్టోబరులో సాంకేతిక ఆమోదం ఇచ్చారు. రూ.23.50 కోట్ల అంచనాతో కడప నగరంలోని రైలునిలయం రోడ్డులో ప్రావిడెంటు ఫండ్ కార్యాలయం - ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయానికి మధ్య గల సువిశాల స్థలంలో శిక్షణ కేంద్రాన్ని నిర్మించాలని నిర్ణయించారు. కడప కలెక్టరేట్ ఆర్టీసీ బస్టాండు, రైలునిలయాలకు అత్యంత సమీపంలోనే ఈ స్థలం ఉంది. ఏపీ ఐఐసీ పనులకు టెండర్లు పిలవగా కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ అర్హత సాధించింది. 2023, డిసెంబరులో ఏపీఐఐసీ ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. సదరు సంస్థ సీటీఐ నిర్మించాల్సిన స్థలంలోని పాత నిర్మాణాలను తొలగించి పనులు ప్రారంభించింది. అన్నీ సజావుగా సాగి ఉంటే అక్కడ ఈ పాటికి సీటీఐ నిర్మాణపనులు ముమ్మరంగా జరుగుతూ ఉండేవి. వైకాపా ప్రజాప్రతినిధులు పనులకు మోకాలడ్డారు.

● సీటీఐ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో కడప నగరపాలక సంస్థ కార్యాలయాన్ని రూ.34 కోట్లతో నిర్మించాలన్న ప్రతిపాదనను తెరపైకి తెచ్చి తీర్మానించారు. దీనిపై భిన్నాభిప్రాయాలు రావడంతో పాత మున్సిపల్ కార్యాలయంలో నగరపాలక సంస్థ కార్యాలయాన్ని నిర్మించేందుకు అప్పటి సీఎం జగన్‌తో శంకుస్థాపన చేయించినా నిర్మాణపనులు ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో సీటీఐ నిర్మించాలనుకున్న స్థలంలో వైకాపా జిల్లా కార్యాలయ భవనం నిర్మించాలనే అంశం తెరపైకి వచ్చింది. దీంతో సీటీఐ నిర్మాణపనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆప్కాబ్ వర్గాలు ప్రతిష్టాత్మకమైన ఈ నిర్మాణాన్ని ముందుకు తీసుకుపోవడానికి విశ్వప్రయత్నాలు చేసినా అప్పటి జిల్లా అధికార యంత్రాంగం సహకరించకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపేశారు. దీనితో ఆప్కాబ్ మేనేజ్‌మెంటు బోర్డు 2024, జులైలో జరిగిన బోర్డు సమావేశంలో కడప సీటీఐ పనులు రద్దు చేశారు. ఏపీఐఐసీ ద్వారా అమరావతిలో సీటీఐ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. వైకాపా అధికారంలో ఉండగా చేతివరకు వచ్చిన ప్రాజెక్టులను కాలితో అడ్డుకుని అధికారం కోల్పోయిన అనంతరం శిక్షణ సంస్థల తరలింపుపై ఉద్యమాలు చేస్తామని చెప్పడంపై జిల్లా వాసులు విస్తుపోతున్నారు.

ఎంపీడీవోలకు బదిలీ ఉత్తర్వులు

కడప ఏడురోడ్లు, వేంపల్లె, న్యూస్‌టుడే: ఉమ్మడి జడ్పీ పరిధిలో పనిచేసే 35 మంది ఎంపీడీవోలు బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు. వీరి బదిలీలు గత నెల 22నే పూర్తయినా ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ, స్వర్ణాంధ్రప్రదేశ్ - 2047, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలతో పాటు పింఛన్ల పంపిణీ ఉండడంతో ఈ నెల 2వ తేదీ వరకు వారిని రిలీవ్ చేయలేదు. గురువారం రాత్రి కలెక్టరు అనుమతితో ఉత్తర్వులు సిద్ధమయ్యాయి. బదిలీ అయిన వారిలో ఉమ్మడి కడప జిల్లా నుంచి 21 మంది, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 7 మంది ఉన్నారు.

ఏడుగురికి అదనపు బాధ్యతలు...

ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించి ఏడుగురికి ఇన్‌ఛార్జి ఎంపీడీవోలుగా నియమిస్తూ జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. వీఎన్‌పల్లె ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న చంద్రమౌళీశ్వర్, పులివెందులలో పనిచేస్తున్న రామాంజనేయరెడ్డి, ఒంటిమిట్ట ఏవో సోమశేఖర్, అట్లూరు ఏవో భాస్కర్‌బాబులను ఆయా మండలాల ఇన్‌ఛార్జి ఎంపీడీవోలుగా నియమించారు.

● ఈవోపీఆర్డీలుగా పనిచేస్తున్న వారిలో మైలవరానికి రామచంద్రారెడ్డి, పోరుమామిళ్లకు రమణారెడ్డి, రైల్వేకోడూరుకు నాగార్జునరావులకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోలుగా బాధ్యతలు అప్పగించారు.

పంచాయతీరాజ్ శాఖలో 302 మంది...

కడప ఏడురోడ్లు : పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 302 మందికి బదిలీ ఉత్తర్వులను శుక్రవారం అందించారు. వీరిలో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు 48 మంది, గ్రేడ్-5 కార్యదర్శులు-99, డిజిటల్ అసిస్టెంట్లు-87, రిక్వెస్టు కింద 68 మంది బదిలీ అయ్యారు.

తహసీల్దార్లు, డీటీలు...

జిల్లా సచివాలయం: జిల్లాలో 8 మంది తహసీల్దార్లు, 12 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కడప డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి బదిలీ

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప డీఎఫ్‌వో పి.వి.సందీప్‌రెడ్డి పాడేరుకు బదిలీ అయ్యారు. అనంతపురం డీఎఫ్‌వోగా పనిచేస్తున్న వినీత్ కుమార్ కడపకు రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. అలాగే అన్నమయ్య డీఎఫ్‌వోగా పనిచేస్తున్న వివేక్‌ను తిరుపతికి బదిలీ చేశారు. అనకాపల్లిలో పనిచేస్తున్న జగన్నాథ్‌సింగ్ అన్నమయ్య జిల్లాకు రానున్నారు. కర్నూలు కన్జర్వేటర్‌గా పనిచేస్తున్న రామకృష్ణను ఏపీ బయోడైవర్సిటీ సభ్యకార్యదర్శిగా బదిలీ చేశారు.

గాలివానకు నేలవాలిన అరటి తోటలు



నేలవాలిన అరటితోట

సింహాద్రిపురం, న్యూస్‌టుడే: మండలంలోని గురిజాల గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిడుగులతో కూడిన గాలివాన రావటంతో బాలనాగిరెడ్డి అనే రైతుకు చెందిన అరటితోటలో మొక్కలు నేలవాలాయి. సుమారు రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. అంకాళమ్మగూడూరు, లోమడ గ్రామాల్లో కూడా అరటిపంటను నష్టం ఏర్పడింది.

వేంపల్లె: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వంద ఎకరాల్లో రైతులు సాగుచేసిన వరిపైరు నేలమట్టమై రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. అలిరెడ్డిపల్లె,తువ్వపల్లె, ఇడుపులపాయ, కుమ్మరాంపల్లె గ్రామాల్లో కురిసిన వర్షానికి చేతికి అందివచ్చిన వరిపంట దెబ్బతింది. మండల వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్ వరిపైర్లను పరిశీలించారు.

నాణ్యమైన విత్తనాలు అందజేయాలి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన బుడ్డసెనగ విత్తనం సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి కోరారు. దీనిపై శుక్రవారం ఏపీ సీడ్స్ జిల్లా అధికారి జగదీష్‌కు వినతిపత్రం అందచేశారు. విత్తనాల రాయితీ 50 శాతానికి పెంచాలని పేర్కొన్నారు. రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

ఏఈ సస్పెన్షన్, ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్ల తొలగింపు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: గృహ నిర్మాణ శాఖ ప్రొద్దుటూరు పట్టణ ఏఈ వెంకటేశ్వర్లు సస్పెండ్‌తోపాటు ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లను తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఆ శాఖ పీడీ రాజారత్నం తెలిపారు. పట్టణ పరిధిలో బొల్లవరం, రామేశ్వరం, మీనాపురం ప్రాంతాల్లో పేదల కోసం 13 వేల గృహాల నిర్మాణాలకు లేఅవుట్లను ఏర్పాటు చేశారు. పేదల ఇళ్ల పనులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను మంజూరు చేసింది. ఇసుకను అక్రమంగా తరలించారనే ఆరోపణలు రావడంతో కొద్ది రోజుల కిందట విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాధికారులు విచారణ చేపట్టారు. బొల్లవరం కాలనీ లేఅవుట్‌లో సుమారు 4 వేల మెట్రిక్ టన్నులు, రామేశ్వరం లేఅవుట్‌లో 9 వేల మెట్రిక్ టన్నులు తక్కువ ఉన్నట్లు గుర్తించారు. వివిధ సచివాలయాల పరిధిలో ఉన్న వెయ్యి కూపన్లను సకాలంలో కంప్యూటరీకరణ చేయలేదు. ఇందులో ఏఈ నిర్లక్ష్యం వహించారని, ఇందుకు ఇసుక సరఫరాలో అక్రమాలు జరగడమే కారణమంటూ విజిలెన్స్ అధికారులు కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. ఆ శాఖ స్థానిక అధికారి నివేదికను ఆధారంగా చేసుకొని ఏఈ వెంకటేశ్వర్లుతోపాటు ఈ లేఅవుట్లో పొరుగు సేవల కింద విధులు నిర్వహిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టరు గుర్రప్ప, ఇందిర, కుమారిలను తొలగించినట్లు పీడీ స్థానిక అధికారులకు సమాచారమిచ్చారు.

ఎర్రగుంట్ల నగర పంచాయతీ ఛైర్మన్ వైకాపాకు రాజీనామా

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల నగర పంచాయతీ ఛైర్మన్, మాజీ మంత్రి మైసూరారెడ్డి కుమారుడు మూలె హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం వైకాపా ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాజీనామా లేఖను పంపారు. దసరా పండగ తర్వాత భాజపా గూటికి చేరబోతున్నట్లు తెలిసింది. హర్షవర్ధన్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సమీప బంధువు. ఆయన సొంత మండలంలోనే పార్టీ పీడటం ప్రాధాన్యం సంతరించుకుంది. దాదాపు 10 మంది కౌన్సిలర్లు ఇదే బాటలో ఉన్నట్లు తెలుస్తోంది.

రిజిస్ట్రార్ రాంప్రసాద్‌రెడ్డిని తొలగించాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: యోగివేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా రాంప్రసాద్‌రెడ్డిని నియమించడం దారుణమని, ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ముడియం చిన్ని, శివకుమార్ డిమాండు చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడారు. నగర కన్వీనర్ విజయ్, కోకన్వీనర్ పెద్దన్న పాల్గొన్నారు.

చిన్నబోయిన తెల్లబంగారం

☛ వరుస నష్టాలతో రైతుల కుదేలు ☛ తగ్గిన పత్తి సాగు విస్తీర్ణం

న్యూస్‌టుడే, కడప, కొండాపురం



కొండాపురం మండలం కొట్టాలపల్లిలో సాగు చేసిన పత్తి పంట

పత్తి ఒకనాడు రైతుల పాలిట తెల్లబంగారం. కాసులు తెచ్చి పెట్టింది. తర్వాత రానురాను కష్ట నష్టాలు పెరిగాయి. పెట్టుబడి పెరుగుతోంది. దిగుబడి తగ్గిపోతోంది. దీంతో అన్నదాతలు ఆసక్తి చూపడం లేదు. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి పంట సాధారణ విస్తీర్ణం 24,086 హెక్టార్లు. జులై, ఆగస్టు నెలల్లో వరుణ కరుణ చూపలేదు. సెప్టెంబరులో ఫర వాలేదు. గత సీజన్ నాలుగు నెలల్లో కలిపి 398 మి.మీ. కురిసినా అన్ని మండలాల్లో సమాంతరంగా పడలేదు. ఈ ప్రభావం పత్తి సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. సీజన్ ముగిసే నాటికి 28 మండలాల్లో 13,080 (54.30 శాతం) హెక్టార్లలోనే వేశారు.

ఖర్చులు తడిసిమోపెడు

పత్తి సాగులో విత్తు దశ నుంచి అమ్మకం వరకు అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయి. దుక్కులు, విత్తనాలు, ఎరువులు, కలుపుతీత, తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ, అత్యవసరమైన సమయంలో నీటి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఎకరాకు కనీసం రూ.20వేలు - రూ.25 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. కౌలుకు తీసుకుంటే భారం అధికమవుతోంది. గత ఆరేడు సంవత్సరాలుగా చూస్తే గులాబీ రంగు పురుగు సమస్యగా మారింది. ప్రకృతి విపత్తులు, చీడలు మరింత దెబ్బతీస్తున్నాయి. నకిలీ వంగడాలు నిండా ముంచేస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి, వేలాది రూపాయలు ఖర్చు చేసినా దిగుబడి అమాంతం తగ్గిపోవడంతో కర్షకులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. విపణిలో ధరలు నిలకడగా ఉండటం లేదు.

అన్ని మండలాల్లో అంతే

చాపాడు మండలంలో 2,069 హెక్టార్లలో సాగవుతుందని అధికారులు అంచనా వేయగా రెండు హెక్టార్లలోనే వేశారు. పోరుమామిళ్లలో 50 హెక్టార్లలో కేవలం ఒక హెక్టారు, కలసపాడులో 133కు 11, కమలాపురంలో 134కు 19.79, సింహాద్రిపురంలో 356కు 45 హెక్టార్లలో సాగైంది. ఇక్కడే కాకుండా చాలా మండలాల్లో కనీసం సాధారణ విస్తీర్ణంలో 50 శాతం కూడా వేయలేదు. రాజుపాళెం, వేముల, పులివెందుల మండలాల్లో మాత్రం సాధారణం కంటే అధికంగా వేశారు.

జిల్లాలో కొన్ని మండలాల్లో పత్తి సాగు సమాచారం (హెక్టార్లలో)

మండలం	సాధారణం	సాగు
బ్రహ్మంగారిమఠం	72	1.77
చింతకొమ్మదిన్నె	306	171
జమ్మలమడుగు	339	84
లింగాల	385	152
ప్రొద్దుటూరు	499	65
కొండాపురం	858	295
ఎర్రగుంట్ల	881	288
పెండ్లిమర్రి	1,358	878
ముద్దనూరు	1,420	514
వేంపల్లె	1,562	1,173
ఖాజీపేట	1,663	925
పెద్దముడియం	1,762	513
వీరపునాయునిపల్లె	1,785	1,236
తొండూరు	2,002	1,068
మైలవరం	2,029	891

ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగు తగ్గిన మాట వాస్తవమే. విపణిలో మంచి ధరలు పలుకుతున్న పంటలపై అన్నదాతలు దృష్టి సారించారు. మినుము, కంది పైర్ల వైపు ఎక్కువ మంది ఆసక్తి చూపారు. అపరాలు, పప్పుధాన్యాలు అధిక విస్తీర్ణంలో వేశారు. **- ఎ.నాగేశ్వర రావు, డీఏవో, వైయస్ఆర్ జిల్లా**

జిల్లా పంచాయతీ అధికారిణిగా రాజ్యలక్ష్మి



బాధ్యతలు చేపడుతున్న రాజ్యలక్ష్మి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : జిల్లా పంచాయతీ అధికారిణిగా గండికోట రాజ్యలక్ష్మి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఆమె విజయవాడలోని ఏపీ ఎస్ఐఆర్‌డీలో గెజిటెడ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై కడపకు వచ్చారు. ఇప్పటివరకు డీపీఓగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం రిలీవ్ అయ్యారు. ఈయనను కర్నూలు జిల్లా ఆదోని డీఎల్‌డీవోగా బదిలీ చేశారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి పాటుపడతామన్నారు. అంతకుముందు పాత డీపీవో ప్రభాకర్‌రెడ్డి, ప్రస్తుత డీపీవో రాజ్యలక్ష్మి పరిపాలనాధికారి ఖాదర్‌బాషా కలెక్టరును మర్యాదపూర్వకంగా కలిశారు.

కడప డీఎల్‌పీవోగా విజయభాస్కర్ : కడప డీఎల్‌పీవోగా విజయభాస్కర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన జమ్మలమడుగుగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

కడప ఆర్డీవో బాధ్యతల స్వీకరణ



ఆర్డీవో జాన్ ఎర్విన్‌కు మొక్క అందిస్తున్న ఏవో శివశంకర్, ఇతర అధికారులు

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: కడప డివిజన్ రెవెన్యూ అధికారిగా జాన్ ఎర్విన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కనిగిరి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, తహసీల్దార్లు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఎర్విన్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని చెప్పారు. తొలుత ఆయన కలెక్టర్ శివశంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

జమ్మలమడుగు ఆర్డీవోగా సాయిశ్రీ...



ఆర్డీవోగా బాధ్యతలు చేపడుతున్న ఆదిమూలం సాయిశ్రీ

జమ్మలమడుగు: జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ నూతన ఆర్డీవోగా ఆదిమూలం సాయిశ్రీ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం స్థానిక నారాపుర వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయం చేరుకుని ఆర్డీవోగా బాధ్యతలు తీసుకున్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి ఆర్డీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారని పరిపాలనా అధికారి తిరుపతయ్య తెలిపారు.

స్ఫూర్తిదాయకంగా పనిచేయాలి



బదిలీపై వెళుతున్న అధికారులను సత్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అధికారులు స్ఫూర్తిదాయకంగా పనిచేసి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్తున్న పలువురు అధికారులను శుక్రవారం సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొత్త ప్రాంతాల్లో కూడా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్, పులివెందుల ఆర్డీవో వెంకటేశ్, జీఎన్ఎస్ఎస్ ప్రత్యేక కలెక్టర్ కౌసర్‌భాను, మున్సిపల్ కమిషనర్ నందన్, చేనేత జౌళి శాఖ ఏడీ నాగరాజు, డీపీవో ప్రభాకర్‌రెడ్డి, డీఎల్‌పీవో వెంకటసుబ్బయ్య తదితరులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, సీపీవో వెంకట్రావు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్, జేడీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్ గ్రంథాలయ భవనాలను పూర్తి చేయండి

కడపలోని సీపీబ్రౌన్ గ్రంథాలయ అదనపు భవన నిర్మాణాలను వచ్చేఏడాది ఫిబ్రవరిలోగా పూర్తి చేయాలని కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. గ్రంథాలయ బోర్డు సభ్యులతో శుక్రవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సలహామండలి సభ్యుడు విజయభాస్కర్, ఆర్అండ్‌బి ఎస్ఈ చంద్రశేఖర్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ సంచాలకులు పార్వతి, యోవేవి రిజిస్ట్రార్ రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలు ప్రశంసనీయం

కడప ఏడురోడ్లు: జిల్లా పంచాయతీ అధికారిగా ప్రభాకర్‌రెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయమైనవని నూతన డీపీవో రాజ్యలక్ష్మి అన్నారు. జడ్పీలోని డీపీఆర్‌సీ భవన్‌లో శుక్రవారం ప్రభాకర్‌రెడ్డికి వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, డీఎల్‌పీవోలు మస్తాన్‌వలీ, విజయభాస్కర్‌లను సిబ్బంది సన్మానించారు. డీపీవో కార్యాలయ ఏవో ఖాదర్‌బాషా, బద్వేలు డీఎల్‌పీవో రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం



3 వికెట్లు తీసిన కార్తీక్‌వర్మ



అర్ధసెంచరీ సాధించిన అక్తర్



రక్షణ్‌సాయి (5 వికెట్లు)

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో చిత్తూరుతో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 58.5 ఓవర్లలో 85 పరుగులకే కుప్పకూలింది. బి.మోక్షజ్ఞరెడ్డి 29 పరుగులు చేయగా, ప్రత్యర్థి బౌలర్లు ఎ.రక్షన్ సాయి 5, కె.ఆశిష్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 87/5 స్కోరు చేసింది. అక్తర్ 53 పరుగులు చేశాడు. వివేక్ 3, పరీక్ 2 వికెట్లు తీశాడు.

● కేవోఆర్ఎం మైదానంలో పశ్చిమగోదావరితో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 209 పరుగులకు ఆలౌటైయింది. తాహీర్ 38, ప్రశాంత్ 37 పరుగులు చేయగా, గౌతమ్, కార్తీక్‌వర్మ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం ప.గో. జట్టు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో 58/2 స్కోరు చేసింది.


● కేవోఆర్ఎం మైదానంలో విశాఖపట్నంతో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జట్టు 77 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటయింది. రాజ్‌మోహన్ 28 పరుగులు చేయగా, రాఘవేంద్ర, వినోద్, ప్రఖ్యాత్‌వర్మ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖ జట్టు ఆట ముగిసే సమయానికి 62/3 స్కోరు చేసింది.

కడప డీఎస్పీగా వెంకటేశ్వర్లు



కడప, నేరవార్తలు: ఎట్టకేలకు కడపకు డీఎస్పీ నియామకం జరిగింది. సుమారు రెండు నెలల అనంతరం ఈ పోస్టును భర్తీ చేశారు. తొలుత నాలుగైదు పేర్లు వినిపించాయి. ఇప్పుడు వారందరిని కాదని ప్రస్తుతం కర్నూలు సీఐడీలో డీఎస్పీగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును నియమించారు. ఆయన గతంలో జిల్లాలో సిద్దవటం, ఒంటిమిట్ట, చక్రాయపేట తదితర ప్రాంతాల్లో ఎస్సైగా పని చేశారు.

ఘర్షణలో వ్యక్తి మృతి



రామకృష్ణారెడ్డి (పాత చిత్రం)

కమలాపురం, న్యూస్‌టుడే: ఘర్షణలో వ్యక్తి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... మండలంలోని అప్పారావుపల్లె గ్రామానికి చెందిన శీలం రామకృష్ణారెడ్డి(66)కి చెందిన పొలం, మూలె ఎల్లారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డిల పొలాలు పక్క పక్కనే ఉన్నాయి. వీటి పైన అదే గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి పొలం ఉంది. శంకర్‌రెడ్డి తన చేలోకి వెళ్లేందుకు దారి అడిగితే ఎల్లారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డిలు ఇవ్వలేదు. ఈ విషయంలో పెద్దమనిషిగా వ్యవహరించిన రామకృష్ణారెడ్డి వేరే మార్గంలో వెళ్లేలా దారిని ఏర్పాటు చేయించారు. ఈ నేపథ్యంలో తమకు తెలియకుండా దారి ఇప్పిస్తావా అంటూ వారిద్దరూ గురువారం రాత్రి రామకృష్ణారెడ్డితో గొడవకు దిగారు. ఘర్షణలో ఆయనను తోసేయడంతో స్పృహతప్పి కిందపడిపోయారు. బంధువులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గతంలో రామకృష్ణారెడ్డి గుండెవ్యాధితో బాధపడుతుంటే స్టంట్ వేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, వివాహిత కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పరామర్శించారు.

ఎర్రచందనం స్వాధీనం... స్మగ్లర్లు పరారు



ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం బీటు అటవీ ప్రాంతంలో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటవీక్షేత్రాధికారిణి కళావతి మాట్లాడుతూ సిద్దవటం బీటు అటవీ ప్రాంతంలో రోజువారి పరిశీలనలో భాగంగా శుక్రవారం అటవీ సిబ్బంది తనిఖీలు చేపట్టామన్నారు. ఎద్దుల గుండాల అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కనిపించగా, తాము అక్కడకి వెళ్లగానే వారు పరారయ్యారని చెప్పారు. ఘటనా స్థలంలో 13 ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయని, వాటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని చెప్పారు. ఉప అటవీక్షేత్రాధికారి ఓబులేసు, బీటు అధికారి పెంచలరెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపా మద్దతుదారులపై వైకాపా వర్గీయుల దాడి

● గొడ్డలి, కర్రలతో దాడి ● స్థల విషయంలో వివాదం



చికిత్స పొందుతున్న కేశవరెడ్డి

చంద్రశేఖర్‌రెడ్డి తలకు గాయాలు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నవెంతుర్ల గ్రామంలో కల్లం దొడ్డి స్థల విషయంలో తెదేపా మద్దతుదారులపై వైకాపా వర్గీయులు దాడికి తెగబడ్డారు. పోలీసులు, బాధితుల వివరాల మేరకు... చిన్నవెంతుర్ల గ్రామానికి చెందిన తెదేపా మద్దతుదారుడు చేరెడ్డి కేశవరెడ్డి, వైకాపా మద్దతుదారుడు మౌళాలిరెడ్డి కల్లాలు పక్కపక్కనే ఉన్నాయి. కొన్ని నెలలుగా రస్తా విషయంలో వీరి మధ్య వివాదం నడుస్తోంది. గతంలో దీనిపై పెద్ద మనుసులు పంచాయితీ చేశారు. శుక్రవారం ఉదయం చేరెడ్డి కేశవరెడ్డి కల్లంలోకి వెళుతుండగా మౌళాలిరెడ్డి, వేంకటేశ్వర్రెడ్డి, నరసింహారెడ్డితో పాటు మరి కొంత మంది కలిసి కర్రలు, గొడ్డలితో దాడి చేశారు. ఈ దాడిలో కేశవరెడ్డితో పాటు ఆయన తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి, మరొక వ్యక్తికి గాయాలయ్యాయి. బాధితులను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 12 మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప చిన్నచౌకు ఠాణా పరిధిలో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసిన మారుతండ్రి రవిశంకర్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, రిమాండుకు ఆదేశించారు.

యూటీఎఫ్‌లో పలువురి చేరిక

కడప విద్య, న్యూస్‌టుడే : ఇతర ఉపాధ్యాయ సంఘాల్లో జిల్లా, మండల స్థాయి నాయకులుగా కొనసాగుతున్న పలువురు నేతలు తమ పదవులకు రాజీనామా చేసి యూటీఎఫ్‌లో చేరారని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెంమహేష్‌బాబు అన్నారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం వారికి నాయకులు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన రెండు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలలో పనిచేస్తున్న ఈరిబాలజోజి, ప్రసాద్, జయరాములు, ఆనందరావు, ప్రసాద్, ప్రభాకర్, బాల ఓబయ్య, సుమనయ్య తమ పదవులకు రాజీనామా చేసి యూటీఎఫ్‌లో చేరారని తెలిపారు. యూటీఎఫ్ ప్రతినిధులు నరసింహారావు, సుజాతరాణి, చెన్నయ్య, ఏజాస్‌అహ్మద్, ప్రభాకర్, జోజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు ఆదర్శనీయం



వాలంటీర్‌కు ఉత్తమ ఎన్ఎస్ఎస్ పురస్కారం అందజేస్తున్న వైవీయూ అధికారులు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధికారులు చేస్తున్న సమాజిక సేవలు అభినందనీయమని వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైవీయూ ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరానికి ఎన్ఎస్ఎస్ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వీసీ రాబోయే రోజుల్లో కూడా సేవలు కొనసాగించాలని సూచించారు. రిజిస్ట్రార్ టి.రామ్‌ప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో వెలుపల ఎన్ఎస్ఎస్ అందించిన సేవలు గుర్తుంచుకోదగినవన్నారు. కోఆర్డినేటర్ ఎన్.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత, రక్తదానం, జాతీయ సమైక్యత వంటి సమాజ సేవా కార్యక్రమాల్లో వాలంటీర్లు, పీవోలు సైనికులుగా పనిచేశారన్నారు. ఉత్తమ వాలంటీర్లుగా డి.మానస (యూనిట్ 9, వైవీయూ), ఐ.మహబూబ్‌బాషా (ఎస్‌బీఎస్‌వీఎం డిగ్రీ కళాశాల, మైదుకూరు), మీనాక్షి (ప్రభుత్వ జూనియర్ కళాశాల, కడప) ఎంపికయ్యారు. వీరితో పాటు పీవోలు, ఉత్తమ కళాశాలలకు పురస్కారాలు అందజేశారు.

అన్నదాతలకు అందుబాటులో ఉండాలి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయి సిబ్బంది అన్నదాతలకు అందుబాటులో ఉండాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. వ్యవసాయ శిక్షణాకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణాకార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల సహాయకులు నిత్యం రైతులతో కలిసి మెలిసి ఉండాలన్నారు. ఈ పంట నమోదు తప్పకుండా చేయాలన్నారు. కేవీకే, డాట్‌సెంటర్ శాస్త్రవేత్తలు పంటలపై సూచనలు ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం డీడీ రమణారెడ్డి, ఆత్మ పీడీ విజయలక్ష్మి, డాట్ సెంటర్ సమన్వయకర్త అంకయ్య, కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి ప్రవీణ్‌కుమార్, తదితరులు మాట్లాడారు.

మారుమూల గ్రామాలకు టెలికం డిజిటల్ సేవలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: దేశంలో మారుమూల గ్రామాలకు టెలికం డిజిటల్ సేవలను శరవేగంగా విస్తరిస్తున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్ శాఖ డిజిటల్ భారత్ నిధి డైరెక్టర్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలో కోనరాజుపల్లెలో బీఎస్ఎన్ఎల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెల్ టవరును శుక్రవారం పరిశీలించారు. రాచగుడిపల్లె గ్రామ సచివాలయంలో ఏపీ ఫైబర్ నెట్ వ్యవస్థ ఎలా పనిచేస్తుందని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో కొత్తగా 45 చోట్ల సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా అధికారులు తెలిపారు. సర్పంచి శేఖర్‌రెడ్డి, బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీ మల్లికార్జునరెడ్డి, ఏపీఎస్ఎఫ్ఎల్ ఏజీఎం వెంకట్రావు, కడప ఆర్ఎం దివాకర్‌రెడ్డి, మార్కెటింగ్, నెట్‌వర్క్ మెనేజర్లు రేవంత్‌రెడ్డి, నాగభూషణం, కొండయ్య పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీల అభివృద్ధిపై జరిగే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి అన్నారు. డీపీఆర్‌సీ భవనంలో శుక్రవారం ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, డీఎల్‌పీవోలకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో సాధారణ పరిపాలన విధానంతో పాటు, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లేఅవుట్స్-బిల్డింగ్ ప్లాన్ నిబంధనలపై తప్పక అవగాహన కలిగి ఉండాలన్నారు. సామాజిక సంక్షేమ పథకాల అమలు సక్రమంగా ఉండేలా శిక్షణలో నైపుణ్యం పొందాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకున్నప్పుడే ఉపయోగం ఉంటుందన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

ప్రధాన రహదారి... ప్రమాదకారి



కలసపాడు మండలంలోని కలసపాడు-గిద్దలూరు ప్రధాన రహదారిలో పాత రామాపురం, సింగరాయపల్లె వద్ద ప్రైవేటు టెలిఫోన్ ఆపరేటర్లు గుంతలు తవ్వి ప్రధాన రహదారిపై ఇష్టానుసారంగా మట్టి దిబ్బలు వేశారు. రాత్రి వేళ సమయంలో వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఎగువరామాపురానికి చెందిన ఓ బోదకుడు అదుపుతప్పి గాయపడ్డాడని స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ డీఈ సలీంను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వెంటనే మట్టిని తొలగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. **-న్యూస్‌టుడే, కలసపాడు**

గాలివాన బీభత్సంతో నష్టం



ఖాదర్‌పల్లెలో చెట్టు కూలి దెబ్బతిన్న రేకుల ఇంటిని చూపిస్తున్న పక్కీరవలి దంపతులు

చాపాడు : చాపాడులో గురువారం రాత్రి వీచిన గాలులు, వర్షానికి 33 కరెంటు స్తంభాలు, 9 నియంత్రికలు దెబ్బతిన్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ సాయిప్రసాద్ తెలిపారు. పోలీసుస్టేషన్, పీహెచ్‌సీ ఆవరణలో, నాలుగు రోడ్ల కూడలి సమీపంలో భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. 34.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖాదర్‌పల్లెలో పక్కీరవలి రేకుల ఇంటిపై చెట్టుకూలి దెబ్బతిన్నాయి.

అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు : ప్రొద్దుటూరు వైద్యం : ప్రైవేటు ట్రావెల్స్ బస్సు టికెట్టు అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని ఆర్టీవో మురళీధర్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఎంవీఐలు నారాయణనాయక్, రవీంద్ర నాయక్, హేమకుమార్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8555806848
బద్వేలు (గ్రామీణ) : 8008573493

స్పందనకు వందనం

మైదుకూరు పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి వెళ్లే దారిలో బావి వద్ద రోడ్డుపై చేరిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులను పంపి తొలగించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సమస్య బుధవారం ప్రచురితమైంది. అధికారులు స్పందించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

?: మైదుకూరు పట్టణంలోని గౌనిరెడ్డిపల్లె ఎస్సీకాలనీలో మురుగు ప్రవహించేలా కాలువలో పూడిక పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి? **-ఎద్దుల తిరుమలయ్య, గోవిందరెడ్డిపల్లె ఎస్సీకాలనీ**

✓: పారిశుద్ధ్య కార్మికులను పంపి పూడిక పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. **-పెంచలప్ప, ప్రజారోగ్య విభాగ అధికారి, పురపాలక**

?: ఎల్లంపల్లె ఉర్దూ పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలి? **-రవి, ఎల్లంపల్లె**

✓: ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికులను పంపి వారంలో రెండురోజులు పరిసరాలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. **-పెంచలప్ప, ప్రజారోగ్య విభాగ అధికారి, పురపాలక**

-న్యూస్‌టుడే, మైదుకూరు



పోరుమామిళ్లలో గాయత్రీ దేవి అలంకరణలో



బద్వేలు అమ్మవారిశాలలో దుర్గాదేవి అలంకారంతో దర్శనం ఇచ్చిన అమ్మవారు



కన్యతీర్థంలో శ్రీ బాలా త్రిపురసుందరిదేవి



కొండాపురం: రాఘవేంద్రస్వామి ఆశ్రమంలో శ్రీ గాయత్రీదేవిగా



బి.మఠంలో దర్శనమిస్తున్న ఈశ్వరీదేవి అమ్మవారు

జగన్మాతా నమోనమః



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో హాజరైన భక్త జనసందోహం

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు అమ్మవారి అలంకారాలు అలరించాయి. శుక్రవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గ మండలాల్లోని అమ్మవారి ఆలయాల్లోని మూలవిరాట్టు, ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకాలంకారాలు వేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు కుటుంబ సమేతంగా హాజరై అమ్మవార్లకు పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సివిల్, ఏఆర్ డీఎస్పీల ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు. **-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం, మైదుకూరు, పోరుమామిళ్ల, బద్వేలు, కొండాపురం, జమ్మలమడుగు గ్రామీణ, బి.మఠం**



మైదుకూరులో ...

గంగమ్మ దేవాలయంలో కిరీటం అపహరణ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలోని కన్నెలూరు గంగమ్మ దేవాలయంలో వెండి కిరీటాన్ని దొంగలించుకు పోయిన ఘటన జరిగింది. దసరా రెండో రోజు సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయాన్ని ముస్తాబు చేసి అమ్మవారిని అలంకరించినట్లు పూజారులు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఇనుప గేటుకు వేసిన తాళాన్ని దుండగులు పగులకొట్టి కిలోన్నర బరువైన వెండి కిరీటాన్ని అపహరించుకుపోయినట్లు ఆరోపించారు. ప్రస్తుతం ధరల ప్రకారం వెండి కిరీటం ధర రూ.1.30 లక్షలకుపైగా ఉంటుందని తెలిపారు. కడప నుంచి క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆలయ పరిసరాలను పరిశీలించినట్లు పట్టణ ఎస్‌ఐ కల్పన తెలిపారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

పెద్దముడియం, న్యూస్‌టుడే: జమ్మలమడుగు నుంచి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును శుక్రవారం ఎన్.కొట్టాలపల్లె గ్రామంలోని పోలీసు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. ట్రాక్టరు డ్రైవరు యాకోబ్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టరును జప్తు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు ఎంపీడీవోగా కె.వి.శ్రీధర్‌నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా పనిచేసిన పి.లక్ష్మీదేవి సిద్ధవటానికి బదిలీకాగా శ్రీధర్‌నాయుడు చాపాడు నుంచి బదిలీపై వచ్చారు.

తహసీల్దారు : చాపాడు : చాపాడు మండల నూతన తహసీల్దారుగా రమాకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు రవీంద్రారెడ్డి బదిలీపై కలసపాడుకు వెళ్లగా ఆ స్థానంలో ముద్దనూరు నుంచి రమాకుమారి చాపాడుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ యామిని బదిలీపై ఎర్రగుంట్లకు వెళ్లగా, ఆ స్థానంలో కృష్ణారెడ్డి చేరారు.

మహిళా సమాఖ్య ఏపీఎంగా శైలజ...

ఖాజీపేట: మండల మహిళా సమాఖ్య ఏపీఎంగా శైలజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

అమృతేశ్వరస్వామి దేవస్థానం నూతన కమిటీ

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణంలోని అమృతేశ్వరస్వామి దేవస్థానం నూతన కార్యవర్గ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కొవ్వూరు రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నామా రమేష్‌బాబు, కార్యదర్శిగా నామా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా శివపురం కళాసాగర్, వల్లంకొండు రఘువంశీ, కోశాధికారిగా బొగ్గరపు కిరణ్‌కుమార్, సహాయ కోశాధికారిగా నూకల శ్రీధర్, సమాచార ప్రతినిధిగా ధారా సంతోష, సభ్యులను ఎన్నుకున్నారు.

వృద్ధుడి మృతి

కొండాపురం, న్యూస్‌టుడే: వాకింగ్‌కు వెళ్లిన తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య (77) జోగాపురం-తాళ్లప్రొద్దుటూరు పాత మట్టిరోడ్డులో మృతి చెందారని ఎస్సై హృషికేశవరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వచ్చిన ఈయన గుండెపోటుకు గురై చనిపోయి ఉండవచ్చన్నారు. వర్షం కురవడంతో మృతదేహం పూర్తిగా తడిచిపోయి ఉందన్నారు. శుక్రవారం ఉదయం మత్స్యకారులు మృతదేహాన్ని చూసి పోలీసులకు చెప్పారన్నారు.

ప్రజా సమస్యలు చర్చలకే పరిమితం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలు చర్చలకే పరిమితమవుతోందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయ సమావేశ భవనంలో మండల ఉపాధ్యక్షులు మల్లు మోహన్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి బాలయ్య, బాధ్య ఎంపీడీవో రంతుల్లయ్య మాట్లాడారు.

మైసూరారెడ్డిపై గౌరవంతోనే ఛైర్మన్ చేశాం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మాజీ మంత్రి మైసూరారెడ్డిపై గౌరవంతోనే ఆయన కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డిని ఎర్రగుంట్ల నగర పంచాయతీ ఛైర్మన్ చేశామని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎర్రగుంట్ల పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆయన రాజీనామాను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఛైర్మన్ పదవికి రాజీనామా చేసుంటే మరొకరికి పదవి వచ్చేదని వ్యాఖ్యానించారు.

తెదేపా నేతతో కార్మిక నాయకుడి భేటీ

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: అమరావతిలోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన టీఎన్‌టీయూసీ రాష్ట్ర సమావేశంలో ప్రొద్దుటూరుకు చెందిన కార్మిక నాయకుడు చింతకుంట కుతుబుద్దీన్ పాల్గొన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొంతుముక్కుల రఘురామరాజును కలిశారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలు, కార్మికుల సమస్యలపై చర్చించారు.

ఎరువులు, మందులు నకిలీవని తేలితే అనుమతి రద్దు

ప్రొద్దుటూరు, పోరుమామిళ్ల, కలసపాడు, జమ్మలమడుగు, మైదుకూరు, న్యూస్‌టుడే: విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహార మందులు నకిలీవని తేలితే అనుమతిని రద్దు చేస్తానని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎ.నాగేశ్వర్రావు హెచ్చరించారు. శుక్రవారం ప్రొద్దుటూరులోని ఆగ్రో, కెమికల్స్ ఏజెన్సీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. నిర్ణీత ధరలకంటే అధికంగా విక్రయించినా, అనుమతి లేకుండా నిల్వలు ఉన్నా క్రిమినల్ కేసులు తప్పవన్నారు. వీరభద్ర కెమికల్స్ ఏజెన్సీకి సంబంధించిన రూ.30,800 విలువ చేసే పురుగు మందులను, శ్రీవెంకటేశ్వర ఆగ్రో, కెమికల్స్ ఏజెన్సీలో రూ.12,190 విలువ గల ఎరువులకు పత్రాలు సరిగ్గా లేనందున విక్రయాలను నిలుపుదల చేశారు. విజయలక్ష్మి, శ్రీవెంకటేశ్వర ఆగ్రో ఏజెన్సీలలో అనుమతి పత్రాలు, అవుట్, ఇన్ వాయిస్‌లను, ఎరువులు, మందులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు అనిత, సురేష్‌రెడ్డి, మాధవి, ఏవోలు శివశంకర్‌రెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు. పోరుమామిళ్ల డివిజన్‌లోని దుకాణాలను ఏడీఏ మురళీధర్‌రెడ్డి తనిఖీ చేశారు. పత్తి విత్తనాలను ప్యాకెట్లలో మాత్రమే అమ్మాలని, లూజుగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలసపాడులో ఏవో జాకీర్‌షరీఫ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైదుకూరు పట్టణంలోని అయిదు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ శాఖ ఏడీఏ కృష్ణమూర్తి, ఏవో ప్రసన్న తనిఖీ చేశారు. యూరియా అధిక విక్రయిస్తున్నారనే ఆరోపణలు రావడంతో తనిఖీ నిర్వహించి లైసెన్స్‌దారులకు సూచనలు చేశారు.

లేఅవుట్లలో యథేచ్ఛగా అక్రమాలు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు వేసి క్రయ విక్రయాలు జరుపుతున్నారని కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ ఈవీ.మహేశ్వరరెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుమారు 206 ఎకరాల వ్యవసాయ భూమిని ల్యాండ్ కమర్షియల్ సర్టిఫికేట్, పంచాయతీ పరిధిలో ఉంటే అప్రూవల్ సర్టిఫికెట్ లేకుండానే ప్లాట్లుగా విభజించి క్రయవిక్రయాలు జరిపినట్లు ఆరోపించారు.

చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు విలువైన ఆభరణాలు వస్తువలు చోరీకి గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. అవకాశం ఉన్న వ్యక్తులు బ్యాంకు లాకరులో భద్రపరుచుకోవాలన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులుంటే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

ప్రొద్దుటూరులో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, సురేష్‌నాయుడు తదితరులు

ప్రొద్దుటూరు వైద్యం, ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: దసరా నవరాత్రుల సందర్భంగా ప్రొద్దుటూరులో అనిబిసెంట్ పురపాలక పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌నాయుడు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. సందర్శకులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, తెలుగు యువత రాష్ట్ర అధికారప్రతినిధి నల్లబోతుల నాగరాజు, నాయకులు ఆసం రఘురామిరెడ్డి, ఈవీ.సుధాకర్‌రెడ్డి, ఖలీల్, చీమల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, ప్రొద్దుటూరు

ఇ.పి.నెం.71/2018,

ఆర్బిట్రేషన్ కేసు నెం.271/2015

1.మెస్సర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, బద్వేలు, కడపజిల్లా, రెప్‌బై ఇట్స్ జిపిఏ హోల్డరు ఎ.వెంకటయ్య ...డిక్రీహోల్డరు/ పిటీషనరు

వర్సెస్

1. ఎమ్. వెంకట కిశోర్ & ఇతరులు ...రెస్పాండెంట్/ జెడిఆర్.నెం.1

ఇ.పి.షెడ్యూలు స్థిరాస్తి వేలము ప్రకటన

పై ఇ.పి.లో ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా డి.హెచ్.ఆర్.కు రావలసిన డిక్రీ మొత్తము +వడ్డీ +ఖర్చులు రూ.32,41,655 ఈనాటి వరకు అగు వడ్డీ, ఖర్చులు, వగైరాలను రాబట్టు కొనుటకు గాను ఇ.పి.లో కనిన ఆస్తిని బహిరంగముగా వేలము వేసి పై రూపాయలు, తదనుగుణంగా వచ్చు వడ్డీ వగైరా మొత్తమును పొందుటకు పై ఇ.పి.ని సలుపగా సదరు ఇ.పి. ప్రొక్లమేషన్ బహిరంగ వేలము కొరకు **21.10.2024**వ తేదీన వాయిదా వున్నది. కావున సదరు తేది ఉ.10.30 గం॥లకు వేలములో పాల్గొనదలచినవారు తమ యొక్క అడ్రస్ ప్రూఫ్/ ఆధార్ కార్డులతో మరియు అత్యధిక పాటదారు ధరావత్తులో 1/4వ వంతు మొత్తమును చెల్లించుకొనటకును సిద్ధముగా రావలయును. వేలము వేయుట, నిలుపదలకు కోర్టు వారికి పూర్తి హక్కులు గలవు.

షెడ్యూలు:- వైయస్.ఆర్. కడప డి., ప్రొద్దుటూరు సబ్ డి., ప్రొద్దుటూరు మండలము సోములవారిపల్లి, గ్రామ పంచాయతీ, రామేశ్వరం రెవిన్యూ గ్రామం, సర్వేనెం.83లో Ac-4.43 సెంట్లు ఈ పైకి Ac.2.00 ఎకరాలు ఈ పైకి Ac.0.11 సెంట్లు 40 చ॥లింకులు లేక 535 చ॥గజములు జాగా ఫ్లాట్ నెం.8, శివసాయి గ్రీన్ సిటీ-2నకు హద్దులు: తూర్పు: పబ్లిక్ రోడ్డు, పడమర: ఫ్లాట్ నెం.9 లోని జాగా, ఉత్తరం: ఫ్లాట్ నెం.7లోని జాగా, దక్షిణం: 24అ॥ వెడల్పు గల రోడ్డు. ఈ హద్దుల మధ్య జాగాకు కొలతలు: తూర్పు- పడమర: ఉత్తర దిశన 73 1/2 అ॥ లేక 22.417 మీ॥ దక్షిణం: దిశన 87అ॥ లేక 26.535మీ॥ ఉత్తరం నుండి దక్షిణం: దక్షిణం వైపున రోడ్డులో అర్ధం హక్కులతో 60॥ లేక 18.13మీ॥ వెరశి 535 చ॥గ॥ లేక Ac.0.11 సెంట్లు లేదా 40 చ॥లింకులు అన్ని ఈజ్‌మెంట్ హక్కులతోటి.

డి.హెచ్.ఆర్. విలువ: **29,00,000/-**, అమీనా విలువ : **35,00,000/-**

(రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు వేలము ప్రకటన)

ఎం.సుధాకర్ బాబ్జీ, డి.హెచ్.ఆర్. వకీలు, కడప

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032. వెబ్‌సైట్: www.shriramfinance.in. బ్రాంచ్ కార్యాలయము : డి.నెం. 4-1-796హెచ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మిద్దెపైన, హెచ్‌పి పెట్రోల్ బంక్ దగ్గర, అశోక్‌నగర్, నెల్లూరు రోడ్డు, బద్వేల్- 516 227, కడప జిల్లా

లాంఛనంగా స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022 వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడమైనది మరియు శాఖ కార్యాలయం బద్వేల్ (ఇకపై కంపెనీ/లెండర్‌గా వ్యవహరించబడును)**

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002(యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (యస్‌యఫ్‌యల్) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు3 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఋణగ్రహీ ఈ క్రింది తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించవలసినదిగా క్రింద ఉదహరించినబడిన తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

బకాయి సొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **డి.03.10.2024**న లాంఛనంగా స్వాధీనం చేసుకోవడ మైనదని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేడమైనది.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా:

1) **ఎన్.అశోక్‌కుమార్,** తండ్రి ఎన్.రామక్రిష్ణయ్య, డి.నెం.13/312, సుమిత్రనగర్, బద్వేల్, కడప జిల్లా
2) **ఎన్.వెంకటశిరీష,** భర్త ఎన్.అశోక్‌కుమార్, డి.నెం.13/312, సుమిత్రనగర్, బద్వేల్, కడప జిల్లా
3) **కె.ఓబులేసు,** తండ్రి కె.ఓబులేసు, డి.నెం.1-65, మిట్టమానుపల్లి, మైదుకూరు, కడప జిల్లా

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము: రూ.34,88,234/- (ముప్పై నాలుగు లక్షల ఎనభై ఎనిమిది వేల రెండు వందల ముప్పై నాలుగు రూపాయలు మాత్రమే)

ఋణ ఖాతా నెంబరు : BADVLTF2106300004

డిమాండ్ నోటీసు తేది: 26.03.2024

స్థిరాస్తుల వివరములు:-

వై.యస్.ఆర్. కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, బద్వేల్ సబ్ జిల్లా, గోపవరం మండలం, బద్వేల్ మున్సిపల్ ఏరియా, మండకలవారిపల్లి గ్రామం, సర్కారు మెట్ట, డి.నెం.828/3, వార్డునెం.13, సుమిత్ర నగర్, పాత డి.నెం.7/693, ప్రస్తుత 8-1-568 గల ఆర్.సి.సి. బిల్డింగ్‌కు హద్దులు: తూర్పు సందు రాస్తా, పడమర: వీధి రోడ్డు, ఉత్తరం: డి.నెం.8-1-569 గల నాయుడు అశోక్‌కుమార్ ఇల్లు, దక్షిణం: జూటూరు నాగరాజు స్థలం, ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 40.5అ. లేదా 12.30 మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 18అ. లేదా 5.40మీ. వెరశి మొత్తం 730.8 చ.అ. లేదా 81 చ.గ. స్థలం మరియు ఇందున నిర్మించిన ఆర్.సి.సి. బిల్డింగ్ అన్ని ఫిక్చర్లు మరియు అనుబంధాలతో సహా.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (SFL) అధీకృత అధికారి పైన పేర్కొబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖా ఆస్తులను దారి మళ్ళించుటకు గానీ యస్‌యఫ్‌యల్ వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

ప్రదేశం: కడప/ జోనల్ కార్యాలయం — సం/- అధీకృత అధికారి,
తేది: 03.10.2024 — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

పూడిక ఇలా... పారేదెలా..?



చిన్నపాటి వర్షానికే రహదారులు చెరువులా మారుతున్నా నగరపాలక సంస్థ మురుగునీటి పారుదల కాలువలను పూర్తిగా విస్మరించింది. కనీసం మ్యాన్‌హోల్‌లను తెరిచి పరిస్థితిని గమనించిన పాపాన పోలేదు. వై జంక్షన్ వద్ద నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ శుక్రవారం అకస్మాత్తుగా మ్యాన్‌హోల్‌ను తెరిచి పరిశీలించారు. కొన్ని నెలల కిందట నిర్మించిన కాలువలో ఇసుక బస్తాలు, నిర్మాణ సామగ్రిని సైతం తొలగించలేదు. దీంతో నీరు పోలేని పరిస్థితిని గమనించి సిబ్బందిపై మండిపడ్డారు. ఇలాగే ఎస్‌బీఐ కాలనీలోనూ గత పదేళ్లుగా కనమరుగైన కాలువను నిర్వహణలోకి తీసుకొచ్చారు. - ఈనాడు, కడప

ఆ అధికారులను వెంటనే తొలగించాలి

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయంలో లైంగిక వేధింపులకు పాల్పడిన వారికి పదవులు కట్టబెట్టి, వర్సిటీ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.గంగా సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూ మెయిన్‌గేట్ ఎదుట ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను తొలగించాలని డిమాండు చేస్తూ కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామన్నారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

స్పందనకు వందనం

కడప ఫక్కీర్‌పల్లెలో గత వారం రోజుల నుంచి భూగర్భడ్రైనేజీలో నుంచి మురుగు నీరు బయటికి వస్తోందని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన నగరపాలక అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టారు. - న్యూస్‌టుడే, చిన్నచౌకు

?: కడప శివారులోని వైయస్‌ఆర్ విగ్రహం సమీపంలో మంచి నీటి పైపు లైకుతో నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలి. - రమణయ్య, ఆర్‌కే.నగర్, కడప.

✓: ఇంజినీరింగ్ సిబ్బందిని పంపించి పరిశీలించి నీరు లీకేజీ కాకుండా మరమ్మతులు చేయిస్తాం.
- చంద్రశేఖర్, వైద్యాధికారి, నగరపాలక, కడప.

?: కడప శివారులోని బుడ్డాయపల్లెలో కాలువలో మురుగు ముందుకు సాగడం లేదు. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి.
- రాములమ్మ, బుడ్డాయపల్లె, కడప

✓: నగరపాలక పారిశుద్ధ్య కార్మికులను పంపించి మురుగునీరు ముందుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం.
- చంద్రశేఖర్, వైద్యాధికారి, నగరపాలక, కడప

స్టాండింగ్ కౌన్సిల్‌లో 33 అంశాలపై చర్చ

కడప నగరపాలక, న్యూస్‌టుడే: కడప నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం మేయర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 33 అంశాలపై చర్చించారు. నగరపాలక సంస్థ సాధారణ నిధుల ద్వారా చేపట్టేపనుల నాణ్యతను నిర్ధారించడానికి థర్డ్ పార్టీ ఏర్పాటు, కార్పొరేషన్ కార్యాలయంలోని మరుగుదొడ్ల నిర్వహణ కాంట్రాక్టు, వివిధ విభాగాలకు చెందిన అధికారుల అద్దె వాహనాల రెన్యువల్ బిల్లుల చెల్లింపు, చికెన్ వ్యర్థాల తరలింపు కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగుల రెన్యువల్ తదితర అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. కుక్కల స్టెరిలైజేషన్ అంశంపై కొందరు సభ్యులు సంబంధిత అధికారుల్ని తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. దీనిపై పలు సందేహాలు ఉన్న నేపథ్యంలో దీనిపై చర్చను వాయిదా వేయాలని నిర్ణయించారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

ఒంటిమిట్ట : మండల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని బాధ్య ఎంపీడీవో బి.సోమశేఖర్ పేర్కొన్నారు. ఒంటిమిట్టలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న ఆయనను గతంలో చక్రాయపేటలో ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా నియమించారు. తిరిగి ఆయనను అక్కడి నుంచి ఇక్కడికి ఏవోగా బదిలీ చేశారు. మండల అభివృద్ధి అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు శుక్రవారం విధుల్లో చేరారు.

చింతకొమ్మదిన్నె : సీకేదిన్నె మండల ఎంపీడీవోగా శుక్రవారం కుళాయిబాబు బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు జిల్లా నాగలాపురం మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

చెన్నూరు : చెన్నూరు ఎంపీడీవోగా కిరణ్ మోహన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం జిల్లా నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ పనిచేసిన సుబ్రహ్మణ్యం కర్నూలు జిల్లా నందికొట్కూరుకు బదిలీ అయ్యారు.

ఘనంగా జంతు దినోత్సవం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: ప్రపంచ జంతు దినోత్సవాన్ని కడప నగరంలోని బీ3జిమ్‌లో ఘనంగా నిర్వహించారు. జిమ్ యజమాని బాషా మొహిద్దీన్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జంతువులను ప్రేమించాలని చెప్పారు.



కేక్ కోస్తున్న బాషామొహిద్దీన్ తదితరులు

కర్ణాటక మద్యం స్వాధీనం

చక్రాయపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లె సమీపంలో కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తీసుకుని వస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రంగారావు శుక్రవారం తెలిపారు. వారి నుంచి 89 కర్ణాటక మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు వల్లెపు రామాంజనేయులు, డేరంగుల విజయకుమార్‌లపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపామన్నారు.


నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే చర్యలు

కడప వ్యవసాయం : నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప మండలంలో పలు దుకాణాలను తనిఖీ చేశారు.

కమలాపురం : నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే డీలర్ల లైసెన్స్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు ఉంటాయని ఏడీఏ నరసింహారెడ్డి హెచ్చరించారు. డీలర్లతో శుక్రవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

జగన్మాతకు భక్తుల జేజేలు

దసరా నవరాత్రుల మహోత్సవాలు రెండో రోజు శుక్రవారం కనులపండువగా జరిగాయి. పలు ఆలయాల్లో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేసి ఏకాంత పూజలు చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. - న్యూస్‌టుడే బృందం



లలిత పంచాయతన ఆలయంలో...



శంకరాపురంలో బాలత్రిపుర సుందరిగా



రవీంద్రనగర్‌లో...



వేంపల్లె : బంగారు చీర అలంకరణలో కన్యకాపరమేశ్వరి



దేవుని కడపలో చిన్నశేష వాహనంపై స్వామివారు



గడ్డిబజార్ సోమసుందరేశ్వర ఆలయంలో...



విజయదుర్గా దేవి ఆలయంలో భక్తుల పూజలు



కమలాపురం అమ్మవారిశాలలో అర్ధనారీశ్వరీదేవిగా...



కడపలో ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



వేంపల్లె ఓంశాంతి భవన్‌లో



సీకే దిన్నెలో త్రిపుర సుందరీదేవిగా...



వేములలో శ్రీరాజ రాజేశ్వరీదేవిగా...



సిద్దవటం మండలం మాధవరం-Iలో...



వల్లూరులో కన్యకాపరమేశ్వరిదేవి

అంకితభావంతో వైద్యం చేయాలి

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఎంతో మందికి ఆరోగ్యమైన జీవితాలు అందించే శక్తి వైద్యులకు మాత్రమే ఉందని, అందుకే రోగులకు అంకితభావంతో చికిత్స అందించాలని రిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ క్యాప్టెన్ సిద్దప్ప గౌరవ్ అన్నారు. వైద్య కళాశాల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తికి ఎంతో ప్రాముఖ్యం ఉందని చెప్పారు. ఇక్కడ వైద్య విద్యను పూర్తి చేసిన విద్యార్థులు దేశంలో ఎక్కడికెళ్లినా కడప వైద్య కళాశాల ప్రత్యేకతను చాటాలన్నారు. అనంతరం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డాక్టర్ వెంకట్రాముడు, ఇతర అన్ని విభాగాధిపతులు, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం...

సర్వజన ఆసుపత్రి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, నూతన ఉత్సాహాన్ని కలిగిస్తాయని అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు అన్నారు. నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం స్పోర్ట్సుడే నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, మానసిక వ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు, జీఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు.



పతకాలు అందుకున్న వైద్య విద్యార్థులతో రిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ క్యాప్టెన్ సిద్దప్ప గౌరవ్



నృత్యం చేస్తున్న వైద్య విద్యార్థులు

పులివెందుల అభివృద్ధికి సహకరించండి



కలెక్టర్ శివశంకర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : పులివెందుల అభివృద్ధికి సహకరించాలని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ తెదేపా బాధ్యుడు బీటెక్ రవి శుక్రవారం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సింహాద్రిపురం మండల తెదేపా పరిశీలకుడు జోగిరెడ్డి, నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

సింహాద్రిపురం, న్యూస్‌టుడే: గురిజాల గ్రామానికి చెందిన వి.రామశేఖర్ (46) కడుపునొప్పి తాళలేక ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇంటి సమీపంలో ఉన్న వేపచెట్టుకు గురువారం రాత్రి చీరతో ఉరేసుకోగా.. కుటుంబ సభ్యులు వెంటనే గుర్తించి కిందకి దించగా అప్పటికే మృతి చెందారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

పురుగు మందు తాగి...

కమలాపురం: మండలంలోని జంగంపల్లె ఎస్సీ కాలనీకి చెందిన రామసుబ్బయ్య(73) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన మద్యానికి బానిసై గత కొన్నాళ్లుగా అనారోగ్యానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో జీవితం మీద విరక్తి చెంది మద్యంలో పురుగుమందు కలిపి తాగారు. కుటుంబసభ్యులు గమనించి కడప సర్వజన ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి...

కడప నేరవార్తలు: కడప-కృష్ణాపురం మార్గమధ్యంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల ఉంటాయని, చొక్కా కాలర్‌పై కడప ఎర్రముక్కపల్లె అని లేబుల్ ఉందని చెప్పారు. మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాధితులకు పుత్తా పరామర్శ

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : తుమ్మలూరు పొలాల్లో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు గురై ఎన్.శివపార్వతి (30), ఎన్.తేజేశ్వర్‌రెడ్డి (10), జి.మారుతీప్రసాద్‌రెడ్డి (30) మృతి చెందిన విషయం తెలిసిందే. రిమ్స్ మార్చురీలో ఉన్న వీరి మృత దేహాలను శుక్రవారం తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సందర్శించి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. తెదేపా మండల సమన్వయకర్త గంగిరెడ్డి, ఆ పార్టీ నాయకులు అన్నమయ్య, ఈశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

పాసుపుస్తకంలో ఆలయ భూమిని నమోదు చేయండి

చక్రాయపేట, న్యూస్‌టుడే: గండిక్షేత్రంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన ఖాజీపేట మండలం చెన్నమక్కపల్లె గ్రామంలో సర్వే నెం.192/3 నందు 0.21 సెంట్లు తరి భూమిని గుర్తించామని గండి ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆ భూమిని దేవస్థానం గండిక్షేత్రం పాసుపుస్తకంలో నమోదు చేయాలని ఖాజీపేట తహసీల్దారును కలిసి శుక్రవారం వినతిప్రతం అందజేశామని వెల్లడించారు.

విద్యుత్తు ఉత్పత్తికి యురేనియం కీలకం

వేముల, న్యూస్‌టుడే: దేశంలో విద్యుదుత్పత్తికి యురేనియం కీలకం కానుందని పరిశ్రమ జీఎం ఎస్ఎం రావ్ పేర్కొన్నారు. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎం.తుమ్మలపల్లె యురేనియం పరిశ్రమలో శుక్రవారం కేక్ కోసి ఘనంగా జరుపుకొన్నారు. ఆయన మాట్లాడుతూ యువతకు సాధికారిత కల్పించే లక్ష్యంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు యూసీఐఎల్ స్థానిక విద్యాసంస్థలతో భాగస్వామ్యం కలిగి ఉందన్నారు. డీజీఎం సుమన్‌సర్కార్, పరిశ్రమ ముఖ్య అధికారులు కిషోర్‌భగత్, సోంజోయ్‌చటర్జీ, ఎన్‌వీరెడ్డి, కేవీ మోహన్‌రెడ్డి, శ్రీకాంత్, మతివాసన్, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేకు కోస్తున్న పరిశ్రమ జీఎం ఎంఎస్‌రావ్, డీజీఎం సుమన్ సర్కార్ తదితరులు

రహదారి నిర్మాణాన్ని అడ్డుకుంటాం...

ప్రజలకు ఉపయోగం లేకుండా, నేరుగా పరిశ్రమకు వెళ్లేందుకు కొత్త రహదారిని నిర్మించేందుకు యూసీఐఎల్ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని మబ్బుచింతలపల్లె మాజీ సర్పంచి శ్రీనాథరెడ్డి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్థసారథిరెడ్డి పరిశ్రమ జీఎం ఎంఎస్‌రావ్‌కు తెలిపారు. ఈమేరకు శుక్రవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనిని కలెక్టర్, పులివెందుల ఆర్డీవో, వేముల తహసీల్దార్, రోడ్లు భవనాలశాఖ ఈఈకి పంపారు. ● విద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని పార్థసారథిరెడ్డి కోరారు.

చౌక బియ్యం స్వాధీనం

సిద్దవటం: మండలంలోని మాధవరం-1 పరిధి కడప-చెన్నై జాతీయ రహదారి వద్ద శుక్రవారం 35 బస్తాల చౌక బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని సిద్దవటం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ చోదకుని, మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాధ్య ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

రైతులకు చేయూతనందించండి

లింగాల, న్యూస్‌టుడే: వర్షాభావ పరిస్థితుల్లో సాగు చేసి పంటలు నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం ఉచితంగా అన్ని రకాల విత్తనాలు ఇవ్వాలని ఎంపీపీ అలవలపాటి రమాదేవి డిమాండు చేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు సభ్యులు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరల్లేవని, తెగుళ్లతో పంట నష్టపోయారని చెప్పారు. స్పందించిన ఎంపీపీ కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యమే పెట్టుబడి

* వైకల్యాన్ని అధిగమించి ఆటో నడుపుతూ జీవనం
* ఆదర్శంగా నిలుస్తున్న దివ్యాంగ యువకుడు

- న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు

ఆ యువకుడికి చిన్నప్పుడే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. అయినా అతను ఆత్మస్థైర్యం కోల్పోలేదు. ఆటో నడపడం నేర్చుకున్నారు. చేత్తో బ్రేకులు వేసేలా వాహనాన్ని తీర్చుదిద్దుకుని జీవనాన్ని సాగిస్తున్నారు. ఆత్మవిశ్వాసం ఉంటే వైకల్యం అడ్డు రాదని నిరూపించారు. కడప అలంఖాన్‌పల్లెకు చెందిన అల్లాబకష్‌కు మూడేళ్ల వయసులో జ్వరం రావడంతో తల్లిదండ్రులు సూది మందు వేయించారు. కొద్ది రోజులకు అతని కాళ్లు చచ్చుపడిపోయాయి. దీంతో నడవలేని పరిస్థితి. పేద కుటుంబమైనా తల్లిదండ్రులు అల్లాబకష్‌ను పదోతరగతి వరకు చదివించారు. తన బిడ్డను ఎవరు పెళ్లి చేసుకుంటారని వారు బాధపడేవారు. ఈ నేపథ్యంలో విజయవాడకు చెందిన షాహినా ఫోన్ ద్వారా అల్లాబకష్‌కు పరిచయమయ్యారు. తర్వాత అది ప్రేమగా మారి వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు. వారికి ముగ్గురు పిల్లలు. వివాహమైన తర్వాత అల్లాబకష్ అలంఖాన్‌పల్లెలోనే చిన్నపాటి దుకాణం పెట్టుకున్నారు. ఆశించిన మేరకు లాభాలు రాకపోవడంతో మూడేళ్ల కిందట డ్వాక్రా సొమ్ముతో ఆటో కొనుగోలు చేసి నడుపుతున్నారు.



ఆటో నడుపుతూ చేతితో బ్రేకు వేస్తున్న అల్లాబకష్

చేత్తో బ్రేకులు వేసేలా మార్చి... : కాళ్లు చచ్చుపడిపోయిన అల్లాబకష్ ఆటో ఎలా నడుతున్నాడనే అనుమానం రావచ్చు. అతను బ్రేక్ నుంచి ఒక పొడవాటి ఇనుప చువ్వను వెల్డింగ్ చేయించి, చేత్తో బ్రేక్ వేసేలా తయారు చేయించారు. మొదట్లో కాస్త ఇబ్బంది పడినా, తర్వాత అలవాటు కావడంతో మామూలు డ్రైవర్ల లాగానే ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అంగవైకల్యాన్ని ఆత్మవిశ్వాసంతో అధిగమించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి ; ఆటోను నాకు అనుగుణంగా మార్చుకుని, నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. గతంలో ఆర్థికసాయం అందించాలని పలుసార్లు అధికారులను విన్నవించినా పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా తగిన ఆర్థిక సహాయం చేస్తే చిన్న వ్యాపారం పెట్టుకుని, పిల్లలను బాగా చదివించుకుంటా. - అల్లాబకష్